# ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

- సాధారణ పరిశీలకుడు రుచేశ్ జైవన్షి, వ్యయ పరిశీలకుడు సౌరభ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 30: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు రుచేశ్‌జైవన్షి, వ్యయ పరిశీలకులు సౌరభ్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని సమీకృత సముదాయ భవనంలో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు సభలు అనుమతులకు ఇతర కార్యకలాపాల కోసం వచ్చే దరఖాస్తులను ఎన్నికల నియమాలకు లోబడి అనుమతులు మంజూరు చేస్తారన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించడం, ఆవేశపూరితమైన, తప్పుదోవ పట్టించే, ద్వేష పూరిత ప్రకటనలకు ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతులు ఉండవని స్పష్టం చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) నిబంధనలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలైన్ టీమ్‌ల బాధ్యతలు, ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు చేసే ఖర్చులను ఏ విధంగా లెక్కిస్తున్నారనే విషయాలను వివరించారు. ఎన్నికల్లో పోటీలో ఉండే అభ్యర్థి ఖర్చు చేసే ప్రతి పైసా ఎన్నికల వ్యయంలోకి వస్తుందని, అందుకు ప్రతి అభ్యర్థి వ్యయ వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ అంశాలపై అభ్యర్థులకు సంపూర్ణ అవగాహన ఉండాలని సూచించారు. అభ్యర్థులు సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రచారానికి పార్టీ ద్వారా, అభ్యర్థి తరపున ఖర్చు చేసే ప్రతి పైసాను పకడ్బందీగా ఎన్నికల వ్యయం కింద జమ చూపెట్టాలని ఆదేశించారు. ఎన్నికల ఖర్చు రూ.95లక్షలు దాటకూడదన్నారు. ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ఏ పార్టీకి కానీ, ఎవరికైనా ఇబ్బందులు ఉంటే తమను నేరుగా సంప్రదించాలని తెలిపారు. జనరల్ అబ్జర్వర్ రుచేశ్‌జైవన్షి ఫోన్ నెంబర్ 87900-15179, ebs ervernagarkurnool@gmail.com మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు సౌరభ్, ఎన్నికల వ్యయ సంబంధించిన ఫిర్యాదుదారులు ఫోన్ నెంబర్ 80198-32010కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ అధికారులు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటించాలని ఈవిషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సీ-విజిల్ యాప్ ద్వారా చేయవచ్చన్నారు.

### మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

పోలింగ్ రోజున మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు రుచేశ్ చైవన్షి, రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ రోజు మైక్రో అబ్జర్వర్ల విధుల గురించి వారు వివరించారు.

## అక్షింతలు పంచితే అభివృద్ధి చేసినట్లేనా?

- మంత్రి జూపల్లి కృష్ణారావు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కోడేరు, ఏప్రిల్ 30 : కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం దేవుడి పేరు చెప్పి ఇంటింటికీ అక్షింతలు పంచితే అభివృద్ధి సాధించినట్లేనా అని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్లు రాబట్టుకోడానికి ఎన్నో కుయుక్తులు పన్నుతున్నదన్నారు. ప్రజా సంక్షేమం అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి మనం రుణపడి ఉన్నామని పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవిని గెలిపించి ఆమె రుణం తీర్చుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఎన్నికల అనంతరం పూర్తి స్థాయిలో అమలు చేసి తీరుతామన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రామ్మోహన్‌రావు, మహేశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ బస్తీరాంనాయక్, కోఆప్షన్ సభ్యులు అబ్దుల్‌కరీం, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలను అమలు చేస్తాం

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ, ఏప్రిల్ 30: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 6 గ్యారెంటీల్లో ఇప్పటికే మూడింటిని అమలు చేసిందని ఆగస్టులో కచ్చితంగా రైతు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరుకాని అధికారులకు

## షోకాజ్ నోటీసులివ్వాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 30 : మూడు నెలలకోసారి నిర్వహించే మండల సమావేశాలకు హాజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం ఎంపీపీ శాంతాబాయి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేసుకోడానికి నిర్వహించే సమీక్షకు హాజరుకాని మండల అధికారులకు షోకాజ్ నోటీసులను జారీ చేసేలా ఉన్నతాధికారులకు నివేదించాలని ఎంపీడీవో బాలచందర్ సృజన్‌ను ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు దక్కించుకొని ఆరు నెలలైనా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయించాలని ఆదేశించారు. నిధుల కొరత లేదని నీటి సమస్య ఉన్న గ్రామాల్లో నివారణ చర్యలు తీసుకొని ప్రజల దాహార్తి తీర్చాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ మంత్రియానాయక్, వైస్ ఎంపీపీ అరుంధతి, ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీకి బుద్ధి చెప్పాలి

లింగాల, ఏప్రిల్ 30 : ప్రజలకు మభ్యపెట్టి మత రాజకీయాలకు చిచ్చు పెడుతున్న బీజేపీకి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవితో కలిసి మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రావు, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రాథోడ్, లక్ష్మణ్‌నాయక్, ఇందిరమ్మ పాల్గొన్నారు.

## ప్రజల భద్రత కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 30 : ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తూ నేర రహిత సమాజ నిర్మాణం కోసమే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ రామేశ్వర్ అన్నారు. మంగళవారం ఉదయం కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్‌నగర్, గచ్చుబావి కాలనీ, హనుమాన్‌నగర్ కాలనీల్లో 86 మంది పోలీసు సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఇండ్లలో నివసించే వారి వివరాలు ఆధార్, రేషన్, ఓటర్ ఐడీ కార్డులను పరిశీలించారు. పత్రాలు లేని 34బైక్‌లు, ఓ కారును స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ కిరాణా షాపు నుంచి 18 బీర్లు, 10 విస్కీ బాటిల్స్ స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ అనుమానితులకు ఇండ్లు అద్దెకు ఇవ్వరాదని, కాలనీల్లో అనుమానస్పదంగా సంచరిస్తున్న వారి సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించిన పత్రాలను పోలీస్‌స్టేషన్‌లో చూపించి తీసుకెళ్లవచ్చన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, కల్వకుర్తి, వెల్దండ సీఐలు నాగార్జున, హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్సైలు మాధవరెడ్డి, మహేందర్, రవి, రాజశేఖర్, వీరబాబు, ఏఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

మద్యం దుకాణాల్లో

## బీర్లు నిల్..

- బెల్ట్ దుకాణాల్లో రూ.200కు విక్రయం
- కొరత ముసుగులో మద్యం వ్యాపారుల అక్రమ దందా..

కల్వకుర్తి, ఏప్రిల్ 30 : వేసవి తాపం నుంచి తట్టుకోవడానికి మద్యం ప్రియులు చల్లని బీర్లను ఎక్కువ ఇష్టపడుతారు. ఎండలు విపరీతంగా ఉండడంతో మద్యం బాబులు చల్లని బీర్లు సేవించి ఆహ్లాదాన్ని పొందుతారు. వేసవి కాలంలో బీర్లకు చాల గిరాకీ ఉంటుంది. కల్వకుర్తి పట్టణంలో ఏడు మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో ఒకరిద్దరు వ్యాపారులు మినహా మిగతా మద్యం దుకాణదారులు నిబంధనల ప్రకారం కేటాయించిన బీర్ల కార్టన్‌ల ను తమకు సంబంధించిన బెల్ట్ దుకాణాల కు చేరవేస్తున్నారు. నిబంధనల ప్రకారం లైట్ బీర్‌ను ఎమ్మార్పీ రూ.150కు విక్రయించాల్సి ఉంటుంది. మద్యం దుకాణాల్లో బీర్‌ను రూ.150 కన్న ఎక్కువగా విక్రయిస్తే ఎక్సైజ్ అధికారులు కేసులు నమోదు చేసి దుకాణం లైసెన్స్‌ను రద్దు చేస్తారు. బీర్లకు ఎక్కువ డిమాండ్ ఉన్న నేపథ్యంలో మద్యం వ్యాపారుల్లో కొందరు బెల్ట్ దుకాణాలకు బీర్ కార్టన్‌ను రహస్యంగా సరఫరా చేస్తున్నారు. బెల్ట్ దుకాణదారులు బీర్‌ను రూ.200కు విక్రయిస్తున్నారు. ఒక్క బీర్‌ను ఎమ్మార్పీ ధర కంటే రూ.50కి ఎక్కువగా అమ్ముతున్నారు. చల్లని బీరు తాగాలనుకునే వారు మద్యం దుకాణానికి వెళ్తే అయిపోయాయని చల్లగా చెబుతున్నారు. ఎలాగైన బీరు కావాలని వాకబు చేస్తే ఫలానా బెల్ట్ దుకాణంలో దొరుకుతుందని ఉచిత సలహా ఇస్తున్నారు. ఇదే విషయమై కల్వకుర్తి ఎక్సైజ్ సీఐని వివరణ అడిగితే.. ప్రతి దుకాణానికి రోజూ 30 కార్టన్‌ల బీర్లు కేటాయిస్తున్నామని, ఏడు దుకాణాలకు 210 కాటన్‌ల బీర్లు (2,520)కేటాయింపులు ఉంటాయని చెప్పారు. ఈ విషయమై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

మోదీతోనే

## అన్ని రంగాల్లో అభివృద్ధి

వెల్దండ, ఏప్రిల్ 30 : ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశం అన్ని రంగాల్లో ముందంజలో ఉంటుందని బీజేపీ జిల్లా కార్యదర్శి బాలస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని కొట్ర గ్రామంలో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాజుచారి, లాలు, కృష్ణ ఉన్నారు.

## ఆర్‌ఎస్‌పీని భారీ మెజార్టీతో గెలిపించాలి

- అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్

అచ్చంపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

అచ్చంపేట, ఏప్రిల్ 30 : బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అచ్చంపేట మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 7వ వార్డులో ఆయన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిందని ఈసారి మళ్లీ మోసపోకుండా ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను గందరగోళానికి గురిచేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి ఇచ్చిన హామీలు అమలు కావాలంటే కారు గుర్తుపై ఓటు వేసి ఆర్‌ఎస్పీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమేశ్‌రావు, శివ, బాలరాజు, గౌస్, శంకర్‌మాదిగ, జగదీశ్, నర్సింహ, రాజు, కళ్యాణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**చారకొండలో..**

చారకొండ, ఏప్రిల్ 30: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా మండలంలోని తిమ్మాయిపల్లిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. హామీలన్నీ అమలు కావాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని పేర్కొన్నారు. ఇంటింటి ప్రచారంలో నాయకులు కమలాకర్‌రావు, కొండల్, ప్రభాకర్, మల్లేశ్ పాల్గొన్నారు.

## ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- కల్వకుర్తి రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీను

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో శ్రీను

కల్వకుర్తిరూరల్, ఏప్రిల్ 30 : త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కల్వకుర్తి రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీను కోరారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, టెంట్, విద్యుత్, వీల్‌చైర్‌లతోపాటు వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత 18 ప్రత్యేక బృందాలు, చెక్‌పోస్ట్ వద్ద సిబ్బంది పని చేసి రూ.8.30లక్షలు, రూ.30 లక్షల విలువ గల మద్యాన్ని సీజ్ చేసినట్లు వివరించారు. ఎన్నికలకు సంబంధించి వీవీ ప్యాట్‌లు, ఈవీఎంలు సీబీఎం కళాశాలలోని స్ట్రాంగ్‌రూంకి చేరాయని ఎన్నికల తర్వాత వాటిని జిల్లా కేంద్రానికి తరలించనున్నట్లు పేర్కొన్నారు. 85 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించామని ఫామ్ డీ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి మే 3 నుంచి 8వ తేదీ వరకు సంబంధిత అధికారులు, సిబ్బంది వారి ఇంటి వద్దకు చేరుకుని ఓటు వేసేలా అవకాశం కల్పిస్తామన్నారు. వారు ఇంటి వద్ద లేకపోతే రెండో సారి అవకాశం ఇస్తున్నట్లు మూడో సారి అవకాశం ఉండదని వారు ఓటువేసే హక్కును కోల్పోతారని పేర్కొన్నారు.

ఓటింగ్‌శాతాన్ని పెంచేందుకు ప్రజలకు పలు విధాలుగా అవగాహన కల్పించినట్లు ఆర్వో తెలిపారు. 13వ తేదీన ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు వేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వేసవి దృష్ట్యా ఓటర్లు వీలైనంత త్వరగా పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు వెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తాసీల్దార్ ఇబ్రహీం ఉన్నారు.

## అడ్వాన్స్ సప్లిమెంటరీలో ఉత్తీర్ణత శాతం పెరగాలి

- జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ
- ఇంటర్ ఫలితాలపై సమీక్ష

ఫలితాలపై సమీక్ష నిర్వహిస్తున్న నోడల్ అధికారి వెంకటరమణ

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 30 : ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణతశాతం పెరగాలని ఇంటర్‌బోర్డు జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ అన్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాలపై మంగళవారం ఆయన జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతి సబ్జెక్టు ఫలితాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే చివరి వారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలోగా ఫెయిలైన విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టు అధ్యాపకులు రెమెడియల్ తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని సూచించారు. మే 2వ తేదీలోగా సప్లిమెంటరీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ అధ్యక్షుడు రంగరాజుల మాధవరావు, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాలరావు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ ఓటర్ స్లిప్ అందించాలి

ఓటర్‌స్లిప్పుల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీవో

కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 30: ఈ నెల 13వ తేదీన జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరికీ ఓటరు స్లిప్పులు అందించాలని ఎంపీవో దేవేందర్ అన్నారు. మంగళవారం కల్వకుర్తి మండలం పంజుగుల, ముకురాల, గుండూరు, లింగసానిపల్లి, రఘుపతిపేట గ్రామాల్లో బీఎల్‌వోలు చేపట్టిన ఓటర్ స్లిప్పు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి గ్రామంలో సకాలంలో ఓటర్ స్లిప్‌లు అందించి ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని బీఎల్‌వోలకు సూచించారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు పాల్గొన్నారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి

నాగర్‌కర్నూల్‌టౌన్, ఏప్రిల్ 30 : ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరేశ్‌బాబు అన్నారు. నాగర్‌కర్నూల్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందన్న విషయం తెలుసుకొని అవసరమైనప్పుడు తమ వజ్రాయుధాన్ని వినియోగించి సమర్థమైన నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో కార్యాలయ సిబ్బంది క్రాంతి, ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి, మేనేజర్ యాదయ్య, సానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ఆరీఫ్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

### ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

బిజినేపల్లి, ఏప్రిల్ 30: మండలంలోని లట్టుపల్లి, బిజినేపల్లి, వడ్డెమాన్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం ఏవో నీతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లు సీజన్‌లో ప్రతి సోమవారం స్టాక్ రిపోర్టు ఇవ్వాలన్నారు. లైసెన్స్ రెన్యూవల్ ఉంటే నెల రోజుల ముందే ఆన్‌లైన్‌లో చేసుకోవాలని సూచించారు. ఫర్టిలైజర్ ఫార్మా ఎంట్రీ లేకుంటే స్టాక్‌ను సీజ్‌చేస్తామన్నారు. అనంతరం మండలంలోని వడ్డెమాన్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునేందుకు వ్యవసాయ విస్తరణాధికారులను సంప్రదించి టోకన్లు తీసుకోవాలన్నారు.

### రైతులకు అవగాహన

బిజినేపల్లి, ఏప్రిల్ 30: మండలంలోని పాలం కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం అటవీ జీవ వైవిధ్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అటవీ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీ జీవ వైవిధ్య సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి శ్రీగంధం, ఎర్రచందనం, టేకు పంటల కోతలకు చట్టపరమైన అనుమతులు, మార్కెటింగ్ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎర్ర చందనం, శ్రీగంధం చెట్ల సాగు పద్ధతులు, నాణ్యమైన మొక్కల ఉత్పత్తి, అటవీ వ్యవసాయ ప్రాముఖ్యత, అనువైన నేలలు, వాతావరణం, వెదురు, మల్బార్, వేప, నీలగిరి, సుబాబుల్ సాగు పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పట్నాయక్, రామాంజనేయులు, చైతన్య, ఉషారాణి, కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మణ్, ఆదిశంకర్, రైతులు పాల్గొన్నారు.

### ఉపాధిహామీ పనుల పరిశీలన

లింగాల, ఏప్రిల్ 30: మండలంలోని దారారం గ్రామంలో జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపడుతున్న చెరువు పూడిక తీత పనులను మంగళవారం ఎంపీడీవో ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజు కూలీల శాతం పెంచాలన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎండలు ముదరక ముందే ఇంటికి చేరుకొవాలని కూలీలకు సూచించారు.

### తాసీల్దార్ ఎదుట ఇద్దరి బైండోవర్

కోడేరు, ఏప్రిల్ 30: మండలంలోని నర్సాయపల్లిలో దాడులు నిర్వహించి సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి మంగళవారం తెలిపారు. దాడుల్లో సిబ్బంది మహేశ్, మంజుల, నారాయానాయక్ పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో జిల్లాలో

# 91.57 శాతం ఉత్తీర్ణత

- పదర, ఉప్పునుంతల మండలాల్లో వంద శాతం ఉత్తీర్ణత
- జిల్లా విద్యాశాఖాధికారి గోవిందరాజులు
- 10/10 సాధించిన విద్యార్థులను అభినందించిన కలెక్టర్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 30: నాగర్‌కర్నూల్ జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో 91.57 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని డీఈవో గోవిందరాజులు తెలిపారు. జిల్లాలోని మొత్తం 20 మండలాలకు పదర, ఉప్పునుంతల మండలాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా 78 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. కేజీబీవీలో 96.49 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 10,526 మంది విద్యార్థులకు 9,621 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కాగా జిల్లా వ్యాప్తంగా 58 మంది విద్యార్థులు 10/10 సాధించారని తెలిపారు. 10 జీపీ సాధించిన తెలకపల్లి మండలంలోని గౌరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు లాల్‌కుమార్, ఉదయ్‌కిరణ్‌ను మంగళవారం కలెక్టర్ ఉదయ్‌కుమార్ అభినందించారు.

**వెల్దండలో..**

వెల్దండ, ఏప్రిల్ 30 : మండలంలోని 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 94.37 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శంకర్ నాయక్ తెలిపారు. జెడ్పీహెచ్‌ఎస్ బొల్లంపల్లి, పోతేపల్లి, వెల్దండ బాలుర పాఠశాలలో 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వెల్దండ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో చందన, అశ్వినిలు 9.5 జీపీఏ సాధించారు. వెల్దండ మోడల్ స్కూల్ విద్యార్థి గణేశ్, రాచూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని దక్షాయన్ని 9.2 జీపీఏ సాధించి శభాష్ అనిపించారు.

**వంగూరులో..**

వంగూరు, ఏప్రిల్ 30 : మండలంలో పదో తరగతి విద్యార్థులు 92 శాతం ఉతీర్ణులైనట్లు ఎంఈవో శంకర్‌నాయక్ తెలిపారు. ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన సింధూజ 9.8, వైష్ణవి, ఇందియాశ్రీ 9.5జీపీఏ సాధించారు. రంగాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన నందిని, వంగూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన నాగభవాని 9.0 సాధించారు. మండలం లో మొత్తం 310 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 285 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తెలిపారు.

**తాడూరు మండలంలో..**

తాడూరు, ఏప్రిల్ 30 : మండలంలోని ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, రెండు రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన 374 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 336 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో భాస్కర్‌రెడ్డి, తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థినులు బి.శివాని, రేవతి 10 జీపీఏ, నందిని 9.7, నిత్య, నందిని 9.5 జీపీఎం సాధించినట్లు ఆయన తెలిపారు.

**తిమ్మాజిపేటలో..**

తిమ్మాజిపేట, ఏప్రిల్ 30 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 90.54 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని 7 ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీలో మొత్తం 275 మంది విద్యార్థులకు 249 మంది ఉత్తీర్ణత సాధించినట్లు మండలవిద్యాధికారి తెలిపారు.

**కోడేరులో..**

కోడేరు, ఏప్రిల్ 30 : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో 93.03 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 330 మంది విద్యార్థులకు 307 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కోడేరు మహాత్మాజ్యోతిరావుపూలే బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని గీత 10 జీపీఏ, వైష్ణవి 9.7, మోడల్ పాఠశాలకు చెందిన ఎస్. పల్లవి, పి.కవిత, సనాబేగం 9.0 జీపీ సాధించినట్లు తెలిపారు.

**పెంట్లవెల్లిలో..**

పెంట్లవెల్లి, ఏప్రిల్ 30 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో 97.7 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి చంద్రూనాయక్ మంగళవారం ప్రకటనలో తెలిపారు.

**పెద్దకొత్తపల్లిలో..**

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 30: మండలంలో పదో తరగతి పరీక్షల్లో 92.3 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో చందూనాయక్ తెలిపారు. మండలంలోని 13 ఉన్నత పాఠశాలల్లో 555 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 518 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

**అచ్చంపేటలో..**

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 30: పది ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన పాయింట్లు సాధించి సత్తా చాటారని ఎంఈవో రామరావు తెలిపారు. ఐనోల్ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఎం.శ్వేత 9.8, జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాల విద్యార్థినులు హర్షియాబేగం 9.8, వై.చందన 9.8, ప్రవళిక 9.7, మనిషా 9.8, శ్రీవాణి 9.5 భాగ్యలక్ష్మి 9.3, ఐనోల్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ఆక్షిత 9.7, డి.శ్రీస్నేహ 9.5, బి.అశ్విని 9.3, వి.శ్వేత9.3, బాలుర మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థి డి.శివ 10, ఐనోల్ బాలికల గురుకుల విద్యార్థిని ఎం.శ్వేత 9.8, ఎ.సింద్ధి 9.7 అచ్చంపేట ఆశ్రమ పాఠశాల విద్యార్థిని ఎం.దినేశ్ 9.5, పి.జశ్వంత్ 9.3, జి.చందు 9.3, కిషన్ 9.3 బాలుర గురుకుల (ఎస్సీ)లవకుమార్ 9.7, రామన్‌కుమార్ 9.5, మహేశ్వర్ 9.5జీపీఏ, సిద్దాపూర్, బొమ్మనపల్లి జెడ్పీహెచ్ ఎస్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో రామరావు తెలిపారు.

**అమ్రాబాద్‌లో..**

అమ్రాబాద్, ఏప్రిల్ 30 : అమ్రాబాద్, పదర మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత, ఆశ్రమ, గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో బాలకిషన్ తెలిపారు. అమ్రాబాద్ మండలంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, బాలుర పాఠశాల మన్ననూర్‌లో పల్లవి 9.5, చరణ్ 9.5 జీపీఏ, మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాజు 9.3, కేజీబీవీ రాయలగండి ప్రవళిక 9.2, ప్రభుత్వ గురుకుల పాఠశాల మన్ననూర్ షాజహాన్ 9, పదర హైస్కూల్ అరవింద్, నిఖిత 9.2, కేజీబీవీ పదర సింధూ, శ్రీజ 9.0 జీపీఏ సాధించినట్లు ఆయన తెలిపారు.

**ఉప్పునుంతలలో..**

ఉప్పునుంతల, ఏప్రిల్ 30: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉప్పునుంతల మండలంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో రామరావు తెలిపారు. మండల పరిధిలోని ఆరు పాఠశాలల నుంచి మొత్తం 239 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 239 మంది ఉత్తీర్ణత సాధించారు.

**చారకొండలో..**

చారకొండ, ఏప్రిల్ 30: మండలంలో చారకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 105 మంది విద్యార్థులకు 75 మంది ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీలో 43 మందికి 40 మంది, జెడ్పీ ఉన్నత పాఠశాలలో 22 మందికి 14 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శంకర్‌నాయక్ తెలిపారు.

**లింగాలలో..**

లింగాల, ఏప్రిల్ 30 : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 78మంది విద్యార్థులకు 78మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బాలస్వామి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 109మంది విద్యార్థులకు 99 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంబట్‌పల్లిలో 40 విద్యార్థులకు 38మంది, బాలికల ఆశ్రమ పాఠశాలలో 12మందికి 12మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బా పాఠశాల విద్యార్థి తాడాజుల కావ్య 9.5 జీపీఏ సాధించారు.

**బల్మూరులో..**

బల్మూరు, ఏప్రిల్ 30: మండలంలోని కొండనాగుల, బల్మూరు, గోదల్, తుమ్మెన్‌పేట, కేజీబీవీల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎంలు రాంసింగ్, లలిత, విష్ణుమూర్తి తెలిపారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు 9.3, 9.2, 9.1, 9.0 జీపీఏ సాధించినట్లు తెలిపారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★ I, AYESHA BEGUM, W/o: MOHAMMED ABDUL SALEEM, R/o: 7-5-200/6, Near S.C Hostel, Laxmi Nagar Colony, Mahabub Nagar - 509001, Changed My Name as AYSHA BEGUM
NT-MBNR

★ I, MOHAMMED MUZHAR GHOURI, S/o: MOHD KHAJA GHOURI, Passport No: A 5763983, R/o: 3-2-17/2, Veerannapet, Mahabub Nagar -509001, Changed My Name as MD.MAZHAR GHOURI
NT-MBNR

★ I, MOHD SHAKIL AHMED, S/o: ABDUL RAHMAN, R/o: 4-4-18/2, Dhoolpet, Narayanpet - 509210, Changed My Name as SHAKEEL AHMED.
NT-MBNR

**డాక్యుమెంట్ పోయినది**

సి. బాలమణి భర్త సి. శేఖర్ గౌడ్, వృత్తి: గృహిణి, వయస్సు 45 సం॥లు, ఇం.నెం. 6-110/34, హ్యాపి హోమ్స్ దగ్గర, శేషాద్రి నగర్, మహబూబ్‌నగర్ జిల్లా, నా యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నంబర్ 365/1987, సర్వే నెం.90/అ, ప్లాటు నెం.05, 200 గజాల గల లింక్ డాక్యుమెంట్ తేదీ: 16-04-2024 నాడు మా ఇంటి నుండి హన్వాడ గ్రామానికి ఆటోలో వస్తుండగా పోయినది. ఎవరికైన దొరికినచో ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.
CELL: 98488 70010

**WANTED**

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899
NT-311840-AII

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794